క్లుప్తంగా

భద్రావతి అమ్మవారి కల్యాణోత్సవం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఓల్డ్ కాలనీలో గల శ్రీ ఉమా మహేశ్వర మార్కండేయ ఆలయంలో భద్రావతి దేవి కల్యాణ మహోత్సవాన్ని శనివారం ఆలయ అర్చకుడు కరుణాకర్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకం చేసిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

30న కబడ్డీ పోటీలు

కెరమెరి: మండలంలోని సాంగ్వి గ్రామంలో గల తెలంగాణ క్రీడా మైదానంలో ఈనెల 30వ తేదీ నుంచి కబడ్డీ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తొడోసం హన్మంత్‌రావు, కొట్నాక శ్యాంరావు, కుర్సెంగ యాదోరావు, కినక సకారాం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ. 7777, రెండో బహుమతి రూ. 5555, మూడో బహుమతి రూ. 3333 అందించనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు 9110709084, 8688055322లలో సంప్రదించాలన్నారు.

సర్వసభ్య సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రేపు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు అన్ని శాఖలకు చెందిన అధికారులు నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

1న అంగన్‌వాడీల సమావేశం

చింతలమానెపల్లి: మండలంలోని అంగన్‌వాడీలకు ఫిబ్రవరి1న సమావేశం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ తెలిపారు. మండలంలోని బాలాజీఅనుకోడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని అంగన్‌వాడీలు హాజరు కావాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సంబంధిత నివేదికలను అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పూర్తిచేసి నివేదికలతో హాజరు కావాలన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధ నది ఒడ్డున గల శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో ఫిబ్రవరి 2వ తేదీన పలు దేవతల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠాపన పోస్టర్లను శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఆలయ కమిటీ సభ్యులు నితేశ్, రాందాస్, ప్రవీణ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవాసమితి సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీ బాలేశ్వర స్వామి ఆలయంలో రథోత్సవం సందర్భంగా శనివారం జాతరకు వచ్చిన భక్తులకు బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సభ్యులు ప్రతాప్, రవీందర్, పవన్, బల్వంత్, శ్రీనివాస్‌రావ్, మహేష్, గిరీష్, సాయితేజ, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

పైపు పగిలింది.. నీటి సరఫరా నిలిచింది

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద పది రోజుల క్రితం జాతీయ రహదారి మరమ్మతులు నిర్వహిస్తుండగా మిషన్ భగీరథ పైపు పగిలి నీరు వృథాగా పోతోంది. ఆ పైపు ద్వారా సుందరయ్య కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకుకు, అక్కడి నుంచి జ్యోతినగర్, తీగల్‌పహాడ్, అల్లూరి సీతారామరాజు నగర్, లక్ష్మీనగర్, తదితర కాలనీలకు నీటి సరఫరా అవుతుండగా, ప్రస్తుతం ఆ పైపు పగలడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి పైపునకు మరమ్మతు చేయాల్సి ఉండగా, వృథాగా పోతున్న నీటిలో మోటార్ వేసి హైవే పనులకు వినియోగిస్తుండడం గమనార్హం. ఈ విషయమై గ్రిడ్, నేషనల్ హైవే అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ, కాలయాపన చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌హెచ్ డీఈ అన్నయ్యను 'సాక్షి' సంప్రదించగా గ్రిడ్ అధికారులు నీటి సరఫరాను నిలిపివేస్తే మరమ్మతులు చేపడుతామన్నారు.

'ఉపాధి' బడ్జెట్ రూ.9.98 కోట్లు



నవేగాం గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ గ్రామసభ (ఫైల్)

- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- 2.44 లక్షల పనిదినాలు
- 2023- 24 ఆర్థిక సంవత్సరానికి 206 పనుల గుర్తింపు

వాంకిడి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఒక్కరికి 100 రోజుల పాటు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి సంబంధించి 2023 -24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను మండల అధికారులు రూపొందించారు. ఆయా గ్రామాల్లో గతేడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించారు. గ్రామాల్లోని కూలీలు, రైతుల డిమాండ్ల మేరకు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశారు. మండలంలో మొత్తం 28 గ్రామ పంచాయతీలు ఉండగా 11 వేల 500 మంది కూలీలు పనిచేస్తున్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు పూర్తి కాగా బడ్జెట్‌కు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులకు పంపించారు.

బడ్జెట్ అంచనా రూ.9.98 కోట్లు

మండలంలో 2023 -24వ ఆర్థిక సంవత్సరం ఉపాధిహామీ పనులకు గాను రూ.9.98 కోట్లు అంచనా బడ్జెట్‌తో కూడిన ప్రతిపాదనలను అధికారులకు పంపించారు. మండలంలో మొత్తం 22వేల ఉపాధి జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 11వేల 500 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. వీరికి 100 రోజుల పాటు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అధికారులు మొత్తం 2.44 లక్షల పనిదినాలు ఖరారు చేశారు. గ్రామసభల ద్వారా కూలీల డిమాండ్ల మేరకు 206 పనులను గుర్తించారు. 2023 -24 ఆర్థిక సంవత్సరంలోని బడ్జెట్‌లో లేబర్ బడ్జెట్ రూ.6 కోట్లు, మెటీరియల్ బడ్జెట్ రూ.4 కోట్లుగా నిర్ణయించారు. కాగా జాబ్‌కార్డ్ కలిగి ఉండి పనులకు వెళ్తున్న కూలీలకు 100 రోజుల పాటు ఉపాధి కలగనుంది.

ప్రతిపాదనలు పంపించాం

"2023- 24 ఆర్థిక సంవత్సరం ఉపాధిహామీ పనిదినాలు, బడ్జెట్‌కు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రానికి నివేదించాం. కేటాయించిన బడ్జెట్ ప్రకారం పనులు జరుగుతాయి. శాశ్వత ప్రయోజనం కలిగే పనులను గ్రామసభల్లో గుర్తించాం. మొత్తం 2.44 లక్షల పనిదినాలు, రూ.9.98 కోట్ల బడ్జెట్‌కు ప్రతిపాదనలు రూపొందించాం."

– చునార్‌కార్ శ్రావణ్, ఏపీవో, వాంకిడి

ప్రధానంగా చేపట్టే పనులు..

- ప్రస్తుతం ప్రధానంగా నీటి సంరక్షణ పనులతో పాటు వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు.
- ఈ ఆర్థిక సంవత్సరంలో 60శాతం నీటి సంరక్షణ పనులు చేపట్టాల్సి ఉండగా, 50 శాతం వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టనున్నారు.
- శాశ్వత ప్రయోజనం కలిగే విధంగా ఈ ఏడాది వ్యవసాయ అనుబంధ రంగాలకు అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత నిచ్చారు.
- సాగు నీటి కాలువల్లో పూడిక తీయడం, చెత్త చెదారం తొలగించడం వంటి పనులు చేపట్టనున్నారు.
- కాలువలు తవ్వడం, పొలాలకు వెళ్లేందుకు మట్టిరోడ్లు నిర్మాణం, బావులు, పశువుల షెడ్లు, ఎరువుల కుండీలు వంటి పనులు చేపట్టాలని కూలీలు, రైతులు డిమాండ్ చేశారు.
- హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం, గుంతలు తవ్వడం, కంచెల నిర్మాణం, మొక్కలకు నీళ్లు పోయడం, తదితర పనులు నిరంతరం కొనసాగనున్నాయి.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి
- ముగిసిన మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి

తిర్యాణి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభా దృష్టికి తీసుకొచ్చారు. గడలపల్లి ఎంపీటీసీ సారా రమేష్‌గౌడ్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మండల కేంద్రంలో మంజూరైన మరుగుదొడ్లను నిర్మించకుండానే సంబంధిత కాంట్రాక్టర్లు బిల్లులు తీసుకున్నారని, మూడు నెలల క్రితం ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వట్టివాగు ప్రాజెక్టుకు వెళ్లే నీటిని సింగరేణి అధికారులు దారి మళ్లించడం ద్వారా భవిష్యత్తులో ఉల్లిపిట్ట గ్రామానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టడంతో పాటు సిబ్బంది స్థానికంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సభ్యులు పేర్కొన్నారు. ఇప్పటికీ 20శాతం గ్రామాల్లో కూడా మిషన్ భగీరథ నీటి సరఫరా జరగడం లేదని, నిర్మించిన ట్యాంకుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో లీకేజీలు అవుతున్నాయని పలువురు సభ్యులు ఆరోపించారు. మండలంలోని అరటిపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న బస్‌షెల్టర్‌ను అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం సరికాదని పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ సభలో ప్రస్తావించారు. గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని, పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాల మరమ్మతులు చేపట్టాలని సభ్యులు అధికారులను కోరారు. ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి మాట్లాడుతూ మండలానికి రెగ్యులర్ ఎంపీడీవో లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. సమస్యపై ఇన్‌చార్జి ఎంపీడీవోకు ఫోన్ చేస్తే స్పందించడం లేదన్నారు. అధికారులు తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అంతకు ముందు అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గాదెవేణి మల్లేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో జావిద్, అధికారులు పాల్గొన్నారు.

పేద ప్రజల అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

సిర్పూర్(టి): రాష్ట్రంలోని పేద ప్రజల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం= చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్ హుస్సేన్, నాయకులు కీజర్ హుస్సేన్, సోహేల్ అహ్మద్, దోని రవి, ఉమాజీ, ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడలో ఘనంగా రథోత్సవం



రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడ గ్రామంలో శనివారం వేదాంత విచారణ ధ్యాన నిష్ఠాశ్రమంలో జగద్గురు బ్రహ్మానందగిరి మహరాజ్ 122వ జయంతి సందర్భంగా ఆశ్రమంలో ఉదయం చిన్నయానందగిరి స్వామి ఆధ్వర్యంలో అభిషేకం, అఖండ దీపారాధన పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన రథోత్సవం కార్యక్రమానికి చుట్టుపక్కల భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు బ్రహ్మయ్య, దాదాజీ, వినోద్, ఆనంద్ రావు, తిరుపతి, మల్లయ్య పాల్గొన్నారు.

ముగిసిన 'బడి బయటి పిల్లల' సర్వే

- 6 నుంచి 25వ తేదీ వరకు కొనసాగిన సర్వే
- వివరాలు సేకరించిన సీఆర్పీలు
- బడికి పంపేందుకు ప్రభుత్వం చర్యలు



శివలింగపూర్ గ్రామంలో ఇంటింటి సర్వే చేస్తున్న సీఆర్పీ, ఉపాధ్యాయులు (ఫైల్)

కౌటాల: బడి బయట పిల్లలతో పాటు మధ్యలోనే చదువు మానేసిన పిల్లలను గుర్తించేందుకు చేపట్టిన సర్వే కౌటాల మండలంలో పూర్తయింది. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంతో పాటు వారిని మళ్లీ బడికి పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సర్కార్ ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయా గ్రామాల్లో బడి బయట పిల్లలను గుర్తించారు. బాలల పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష నేతృత్వంలో ఓఎస్‌సీ సర్వే నిర్వహించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని సీఆర్పీలు సర్వే చేశారు. ఏటా 6 నుంచి 14ఏళ్ల లోపు ఉన్న బడి బయటి పిల్లలను మాత్రమే గుర్తించేవారు. కాని గత ఏడాది ప్రత్యేకంగా 15 నుంచి 19 ఏళ్ల లోపు వయస్సు కలిగి, ఉన్నత విద్య ఆపేసిన వారిని సైతం గుర్తించారు.

బడిలో చేర్పించేలా..

బడి బయట, బడి మానేసిన పిల్లలను గుర్తించే సర్వేను జిల్లాలో పకడ్బందీగా చేపట్టారు. సంబంధిత అధికారులు, సిబ్బందితో ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించి బడిబయట పిల్లలను గుర్తించడంతోపాటు సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో సీఆర్పీలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పిల్లల వివరాలను ఆరా తీశారు. ఆయా రాష్ట్రాల నుంచి పలువురు కూలీలు వలస వచ్చి జిన్నింగ్ మిల్లుల్లో, పత్తితీత, మిర్చి కోత పనుల్లో నిమగ్నమై నెలల తరబడి స్థానికంగా నివాసం ఉంటున్నారు. వారంతా వారి పిల్లలను బడికి పంపించడం లేదు. దీంతో నిరక్షరాస్యులుగా మారుతున్నారు. వారిని సైతం బడికి పంపే ప్రయత్నం చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇంటింటి సర్వే

ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ (ఓఎస్‌సీ) పేరిట చేపట్టిన సర్వేలో 6 -14 ఏళ్లు, 15 -19 ఏళ్ల వయసున్న వారిని గుర్తించి వచ్చే విద్యా సంవత్సరం (2023-24) నుంచి పాఠశాల వైపు అడుగులు వేయించనున్నారు. మండలంలో సీఆర్పీలు చేపట్టిన ఇంటింటి సర్వేలో మొత్తం 27 మంది పిల్లలను గుర్తించారు. ఇందులో 14 మంది బాలురు, 13 మంది బాలికలు ఉన్నారు. వారికి చదువుపై అవగాహన కల్పించి మళ్లీ బడుల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

మహాసభ విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నార్నూర్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఫిబ్రవరి 11, 12న ఉట్నూర్‌లో నిర్వహించే ప్రజాతంత్ర విద్యార్థి సంఘం మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వాగ్మారే సంబాజీ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగం పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల సంఖ్యను పెంచుతున్నారని కానీ ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. కార్యాలయంలో కుటికెల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాగోబా దర్బార్‌లో విద్యార్థుల ప్రతిభ



నగదు అందజేస్తున్న తొడసం నాగోరావు

నార్నూర్: ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మండలంలోని మాన్కాపూర్ దిశ మోడల్ పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటారు. నృత్యం ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డిని ఆకట్టుకోవడంతో శనివారం రూ. 5వేలు నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగుకు బహుమతిగా అందజేసినట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకుడు కిషన్, గ్రామ పెద్దలు సీతారాం, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో ఏడు తీర్మానాలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం ఏడు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పారిశుధ్య పనులను మెరుగుపర్చేందుకు అదనపు పారిశుధ్య సిబ్బందిని ఆరు నెలల పాటు తీసుకునేందుకు అయ్యే ఖర్చు రూ.22లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లకు ఇన్సూరెన్స్ చేసేందుకు రూ.2.50లక్షలను సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, రెవెన్యూ అధికారి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి పూజలు



పూజల్లో పాల్గొన్న డైరెక్టర్, అధికారులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సింగరేణి డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ, డీజీఎం చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో సింగరేణి యోగా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం సతీమణి, సేవామితి ఏరియా అధ్యక్షురాలు లక్ష్మి హాజరై కార్యక్రమం ప్రారంభించారు. యోగా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ ములకల్ల శంకర్, కొంపెల్లి రమేష్, రాజలింగు, అనంతాచార్యులు, గ్రౌండ్ ఇన్‌చార్జి తిరుపతి తదతరులు ఉన్నారు.

వంతెన నిర్మించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి 24వ వార్డులో వాగు అవతల వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వారికి వాగుపై వంతెన లేక రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వెంటనే వంతెన నిర్మించాలని కోరుతూ టీడీపీ నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య, రాష్ట్ర మహిళా కార్యదర్శి షరీఫా, నాయకులు వాసాల సంపత్, సింగతి రంగనాథ్ ఉన్నారు.

సమస్యల్లో కస్తూరిబా గాంధీ పాఠశాల

- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు



కింద కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థినులు

నార్నూర్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థిలకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయాలను ఖర్చు చేస్తోంది. అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యను ప్రారంభించిన అధికారులు సరైన సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. మొత్తం 254 మంది విద్యార్థినులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఇందులో 43 మంది ఇంటర్ విద్యార్థినులు ఉన్నారు. తరగతి గదిలో బ్లాక్ బోర్డు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. బెంచీలు లేక నేలపైనే కూర్చోని పాఠాలు వింటున్నారు. ప్రభుత్వం ట్రంక్ పెట్టెలు సరఫరా చేయకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్న బ్యాగులోనే బట్టలు, వారికి సంబంధించిన వస్తువులు దాచుకుంటున్నారు. పాఠశాలు చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కస్తూరిబా గాంధీ పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

జన్నారం: విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే అవసరమని ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడు రామిరెడ్డి అన్నారు. ధర్మారం పాఠశాలలో శనివారం ప్రముఖ మాస్టర్ రహిమతుల్ల ఆధ్వర్యంలో కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కరాటే నేర్చుకోవడానికి ముందుకు వచ్చి, ఆత్మరక్షణకు ఉపయోగించుకోవాలని సూచించారు.